## చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలి



ప్రభుత్వం వైద్యసిబ్బంది రక్షణ కోసం చేసిన చట్టాలు సమర్థవంతంగా అమలు చేయాలి. వైద్యసిబ్బందికి భరోసా కల్పించే విధంగా ప్రభుత్వాలు చట్టాలు చేయాలి. కోల్‌కతా ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రుల్లో నిరంతర పటిష్ట నిఘా అమలు చేయాలి.

- పి.సీత,
ఏఎన్‌ఎం



## పటిష్ట భద్రత కల్పించాలి



ప్రతి ఆస్పత్రిలో పటిష్టమైన భద్రత కల్పించాలి. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందిపై దాడులు జరగటం సర్వసాధారణంగా మారింది. దీనివల్ల వైద్య సిబ్బందిలో అభద్రత భావం నెలకొంటుంది. చట్టాలు సమర్థవంతంగా అమలు చేసి మరో మారు ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలి. మహిళలకు ప్రత్యేక రక్షణ కల్పించాలి.

- కె.సత్యనారాయణ,
రిటైర్డ్ డెప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్

## క్లుప్తంగా

### నగర ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లోకానికి జ్ఞానాన్ని పంచిన గీతాచార్యుడు అయిన శ్రీ కృష్ణుని జన్మదినోత్సవం సర్వ మానవాళికి పర్వదినమని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకొని నగర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మహావిష్ణువు ఎనిమిదో అవతారమే శ్రీకృష్ణపరమాత్మ స్వరూపమని.. దశావతారాల్లో పరిపూర్ణమైనదని మల్లాది విష్ణు పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి జీవితం ఒక ధర్మశాస్త్రం అని.. సమస్త మానవాళిని సన్మార్గంలో నడిపే విధంగా ఆ పరమాత్ముడు అర్జునునికి గీతను బోధించాడని పేర్కొన్నారు. భగవద్గీత ద్వారా శ్రీ కృష్ణుడు బోధించిన సందేశాన్ని శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగ గుర్తు చేస్తుందన్నారు. గీతాసారాన్ని మనసున నింపుకోగలిగితే జీవితం సంతోషమయం అవుతుందని మల్లాది విష్ణు తెలిపారు.

### నేటి వీఎంసీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు చేస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సెలవు కావడంతో కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. జోనల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.

### 28న రమణ బాలచంద్రన్ వీణా వాద్య కచేరీ

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో ప్రముఖ వీణా విద్వాంసుడు రమణ బాల చంద్రన్ వీణా వాద్య కచేరీ నిర్వహిస్తున్నట్లు సంగీత సమితి కార్యదర్శి సీవీ రావ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకోటిలోని విద్యాభారతి శ్రవణ సదనంలో 28వ తేదీ బుధవారం సాయంత్రం కచేరీ జరుగుతుందన్నారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, సివిల్ సప్లయిస్ కమిషనర్ సిద్ధార్థ జైన్ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

### దంత వైద్యశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దంత వైద్యంలో ఎంతో అనుభవం కలిగిన వైద్యులు చైతన్య, శ్వేత ఏర్పాటుచేసిన స్మైల్ డెంటల్ హాస్పిటల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సమాచార శాఖమంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు రోడ్డులోని సీతారాంపురం సిగ్నల్ వద్ద ఎమ్మెల్యే బొండా ఉమ మహేశ్వరరావుతో కలిసి స్మైల్ డెంటల్ హాస్పిటల్‌ను ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లేటెస్ట్ టెక్నాలజీతో అన్ని రకాల సదుపాయాలతో ప్రజలకు సేవ చేసేందుకు హాస్పిటల్ ప్రారంభించడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం వైద్యులు చైతన్య, శ్వేత మాట్లాడుతూ.. ఆరు నెలల పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు వారికి ఉన్న దంత సమస్యలకు సంబంధించి అన్ని రకాల వైద్య సేవలు తమ వద్ద లభిస్తాయని చెప్పారు.

### భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని పోరెడ్డి సరస్వతి అనే మహిళ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శాంతినగర్‌కు చెందిన పోరెడ్డి రాఘవరెడ్డి ఆర్మీలో పని చేసి రిటైర్ అయిన తర్వాత బస్టాండ్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఆరోగ్యం సరిగా లేదని ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో రాఘవరెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

## వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం



విశేష అలంకరణలో స్వామివారు



పుష్పాభిషేకానికి పూలు సిద్ధం చేస్తున్న భక్తులు



నృత్యం చేస్తున్న కళాకారిణి

ఇస్కాన్ మందిర ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా జగన్నాథస్వామివారికి పుష్పాభిషేకం, 108 రకాల పిండివంటలతో భోగ సమర్పించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు. అంతకు ముందు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఉట్టి కొడుతున్న యువకులు

## మన సంస్కృతీ సంప్రదాయాలు నేటి యువతకు తెలపాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆధునికత మోజులో పడి నేటి తరం యువత మన సంస్కృతీ సంప్రదాయాలను మర్చిపోతుందని బ్లూమింగ్‌డేల్ స్కూల్ చైర్మన్ అట్లూరి విజయబాబు అన్నారు. భారతీయ సంస్కృతీ, కళలు, వృత్తులు, వాటి విశిష్టతను భావి భారత పౌరులైన విద్యార్థులకు తెలియచేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. నగరంలోని బ్లూమింగ్‌డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం సంస్కృతి 2024 పేరిట వినూత్న కార్యక్రమం నిర్వహించారు. మన సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులను, తల్లిదండ్రులను అలరించింది. పల్లెటూరి వాతావరణం, వస్త్రధారణ, చిరుధాన్యాలతో వంటలు ఇలా మన పూర్వీకుల జీవన విధానాన్ని తెలిపేలా చేసిన ఏర్పాట్లు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. సాంప్రదాయ దుస్తులతో ఉన్న విద్యార్థులను చూసి తల్లిదండ్రులు సంబరపడ్డారు. పూర్వం గ్రామాల్లో అందరూ కలిసి మెలిసి ఆడుకున్న ఆటలను విద్యార్థులకు పరిచయం చేయడమే కాకుండా వారితో ఆడించారు. మన పూర్వీకులు తినే ఆహారం, పిండివంటలు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ.. మన పూర్వీకుల అలవాట్లు, జీవన విధానాలు తెలపడం ద్వారా భవిష్యత్తు తరాలకు మన సంస్కృతీ సంప్రదాయాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ హర్ సిమ్రన్, నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు జి.సురేంద్ర, విజయవాడ క్లబ్ కార్యదర్శి సతీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఠాగూర్ గ్రంథాలయంలో చేతిరాతలో శిక్షణ



విద్యార్థులకు శిక్షణనిస్తున్న ఉపాధ్యాయురాలు దుర్గాభవాని

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థులకు చేతిరాతలో శిక్షణ ఇచ్చారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఎం.దుర్గాభవాని విద్యార్థులకు అందమైన చేతిరాతకు కావాల్సిన మెలకువలు నేర్పించారు. ఆమె మాట్లాడుతూ.. మంచి చేతిరాత కలిగి ఉండటం ఎంతో ముఖ్యమన్నారు. పిల్లలకు చేతిరాత నేర్పించడమంటే అభ్యసన ప్రక్రియ, భావ వ్యక్తీకరణ నేర్పించటమే అని పరిశోధకులు తేల్చారన్నారు. చేతిరాత నేర్చుకునే పిల్లలు తాము రాసే అక్షరాలపై శ్రద్ధ ఉంచుతారని, ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. అందమైన చేతి రాత ఉంటే భవిష్యత్‌లో కెరీర్ బాగుంటుందన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు పొందే అవకాశం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో చేతిరాత అభ్యసన చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణునికి నృత్యనీరాజనం



శ్రీకృష్ణులు, గోపిక వేషధారణలో చిన్నారులు



కూచిపూడి నృత్యాలను ప్రదర్శిస్తున్న కళాకారులు



అమృత హస్తం నాటికలోని సన్నివేశం

విజయవాడ కల్చరల్: దృశ్యవేదిక ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాట్యాచారిణి గోనుగుంట శైలజ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ కళానిలయం బృంద సభ్యులు సత్యనందిని, కావ్య, హేమస్వి, లావణ్య, ఆసిక, శైలజ, కాత్యాయని, రాస్య, హసిత, ఖ్యాతి గణపతి నృత్యం, తరంగం, నారయణీయం, కృష్ణ, కృష్ణ జయ అంశాలకు నృత్యాలను అభినయించారు.

**అలరించిన అమృత హస్తం నాటిక**

అమృత హస్తం నాటికలను ప్రేక్షకులను అలరించింది. ఒక తల్లికి జన్మించిన అన్నా, చెల్లె ప్రేమ అమృతతుల్యమైదనవి చాలా గొప్పవి అవి సదా అలాగే ఉండిపోవాలి, సమాజంలో మృగ్యమైపోతున్న మానవతా విలువలు, నేటి సమాజానికి అవాజ్యమైన ప్రేమ ఎంత అవసరమో చాటి చెప్పేది అమృత హస్తం నాటిక కథా అంశం. రచన కావూరి సత్యనారాయణ, దర్శకత్వం హరిబాబు వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు హెచ్ వీఆర్ఎస్ ప్రసాద్, బుర్రా నరేన్ పాల్గొన్నారు. కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

**భారతీయ విద్యామందిర్‌లో కృష్ణాష్టమి వేడుకలు**

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీనగర్ కాలనీ శ్రీ భారతీయ విద్యామందిర్‌లో ఆదివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపిక వేషధారణలతో చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం జరిగింది. శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీ భారతీయ విద్యామందిర్ డీన్ జేవీ షణత్ కృష్ణ, ప్రిన్సిపాల్ స్వప్న శ్రీ కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. చిన్నారుల్లో సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేసేందుకు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించామని తెలిపారు.

### ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డులో వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో వ్యక్తి గాయపడిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన ఎండీ ఖలీల్ బేగ్ భానునగర్‌లోని తన కుమార్తె ఇంటికి వచ్చారు. ఆదివారం తన మనవడికి ఐస్ క్రీమ్ ఇప్పించేందుకు బీఆర్టీఎస్ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో గాయపడిన ఖలీల్ బేగ్‌ను ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 7 నుంచి వినాయక చవితి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వచ్చే నెల 7 నుంచి 19వ తేదీ వరకు మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో నిర్వహించే వరసిద్ధి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆదివారం ఎమ్మెల్యే సతీమణి బోండా సుజాత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 38 ఏళ్లుగా ప్రతి ఏటా వినాయకుని గుడిలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ వ్యవస్థాపకుడు రంకిరెడ్డి సూర్యనారాయణను అభినందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యుడు రంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించటానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 15వ తేదీన అన్నదానం, 19న వినాయకుని ఊరేగింపు నిమజ్జనోత్సవం జరుగుతుందని తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

### బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వ్యక్తులకు కౌన్సెలింగ్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 35 మందికి ఆదివారం రాత్రి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. సితారసెంటర్, ఎట్కిన్ సన్ స్కూల్ రోడ్డు, పంట కాలవ రోడ్డు, భవానీపురం బోట్ ఏజెన్సీ, గొల్లపూడి కరకట్ట ప్రాంతాల్లో భవానీపురం పోలీసు స్టేషన్ సీఐ ఉమా మహేశ్వరరావు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవిస్తున్న 35 మందిని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ చేశారు. మరోసారి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## స్పందన సేవా సమితి సేవలు అభినందనీయం



రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా

పాయకాపురం(విజయవాడరూరల్): స్పందన సేవాసమితి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. పాయకాపురం ఎస్ఎస్ కల్యాణ మండపంలో స్పందన సేవా సమితి, స్పందన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్పందన సేవా సమితి పాయకాపురం పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలను ఉచితంగా చేయించడంతో పాటు వారికి మందులను ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. నిర్వాహకులను, వైద్యులను ఆయన అభినందించారు. వైద్య శిబిరంలో 222 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ చిన్నం రామకృష్ణ, స్పందన సేవాసమితి, స్పందన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, పలువురు సేవాసమితి ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

## పేద ముస్లింలకు ఏఎంసీ సభ్యులు అండగా ఉండాలి



నియామక పత్రాలు అందజేస్తున్న నాగుల్‌మీరా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ముస్లింల హక్కులను కాపాడేందుకు ఆజాద్ ముస్లిం కమిటీ సభ్యులంతా వారికి అండగా ఉండాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా పిలుపునిచ్చారు. సింగ్‌నగర్‌లోని ఏఎంసీ కార్యాలయంలో ఆ కమిటీ ముఖ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడతూ.. నిరుపేద ముస్లింల హక్కులను కాపాడేందుకే ఆజాద్ ముస్లిం కమిటీ ఏర్పాటైందన్నారు. ఆపదలో ఉన్న నిరుపేద ముస్లింలకు ఏఎంసీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని చెప్పారు. అనంతరం 59వ డివిజన్ ఆజాద్ ముస్లిం కమిటీ ఉపాధ్యక్షులుగా షేక్ నబి, షేక్ నాగుల్‌మీరా, సహాయ కార్యదర్శిగా షేక్ రబ్బానిలను నియమిస్తూ వారికి నియామక పత్రాలు అందజేశారు. కమిటీ చేపట్టే సేవా కార్యక్రమాల్లో భాగంగా అక్టోబర్‌లో తోపుడు బండ్ల పంపిణీ, నవంబర్‌లో వైఎస్సార్ కాలనీలో ట్రై సైకిళ్లు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ నాయకులు షేక్ సాజిద్ అలీ, షేక్ మస్తాన్, అన్వర్ బేగ్, సిలార్ బేగ్, అతావుల్లా, రఫీ, సుభాని తదితర కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి నిత్యావసర సరుకుల వితరణ



రాంబాబుకు సరుకులు అందజేస్తున్న ఏఎస్ఐ సత్యరాజు, రవి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎవరూ లేని దివ్యాంగుడికి దీవెన ఫౌండేషన్ నిత్యావసర సరుకులను వితరణ చేసింది. విజయవాడ రూరల్ నున్న గ్రామానికి చెందిన దివ్యాంగుడు రాంబాబు తినడానికి తిండి లేక గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో అతను సహాయం కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించగా వారు వెంటనే స్పందించారు. విజయవాడ సిటీ పోలీస్ తరఫున నెలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలను నున్న పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సత్యరాజు, గ్రూప్ సభ్యులు రవి ఆదివారం రాంబాబు ఇంటికి వెళ్లి అందజేశారు. ఆపదలో తనలాంటి పేదవారికి సహాయం చేస్తున్న దీవెన ఫౌండేషన్ గ్రూప్ సభ్యులకు రాంబాబు కృతజ్ఞతలు తెలియజేశాడు.

## రేపటి నుంచి గంధ మహోత్సవం



బాబాజీ హజరత్ సయ్యద్ అమీనుద్దీన్ చిష్టీ దర్గా

భవానీపురం(విజయవాడ పశ్చిమ): స్థానిక స్వాతి సెంటర్‌లోని బాబాజీ హజరత్ సయ్యద్ అమీనుద్దీన్ చిష్టీ ఔలియా దర్గా 40వ ఉరుసు(గంధం) మహోత్సవం ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఖాజీ, దర్గా ముతవల్లి/అధ్యక్షుడు సయ్యద్ షా మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ చిష్టీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు మంగళవారం ఉరుసు ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు భవానీపురంలోని బాబా దర్గా నుంచి గంధం తీసుకుని వాహనంలో ఊరేగింపుగా బయలుదేరి ప్రకాశం బ్యారేజీ, కాళేశ్వరరావు మార్కెట్ మీదుగా వించిపేటలో బాబా దేవుని ధ్యానం చేసిన ప్రదేశానికి(రైల్వే స్టేషన్ వెస్ట్ వైపు గల షాజహూర్ ముసాఫిర్ ఖానాలోని షాప్ నంబర్ 9) వద్దకు చేరుకుంటుందని చెప్పారు. తిరిగి అక్కడి నుంచి బయలుదేరి సొరంగం మీదుగా రాత్రి 9 గంటలకు బాబా దర్గాకు చేరుకుంటుందన్నారు. అనంతరం గంధంను దర్గాకు తీసుకువస్తామన్నారు. గురువారం దీపారాధన, సాయంత్రం ప్రసాదం పంపిణీ జరుగుతుందన్నారు. అదే రోజు రాత్రి 9 గంటలకు ఖవ్వాలీ ప్రోగ్రామ్ ఉంటుందని తెలిపారు.

### రేపు ఓపెన్ జిమ్ ప్రారంభం

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఎంపీ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ ఫండ్స్ రూ. 7 లక్షలతో ఈ ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. అదనంగా వాకర్స్ అసోసియేషన్ ఆర్థిక సౌజన్యంతో జిమ్ ప్రాంగణంలో కాంక్రీట్ లెవలింగ్, చుట్టూ ఐరన్ మెష్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓపెన్ జిమ్‌ను మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వాకర్స్ సభ్యులు, క్రీడాభిమానులు హాజరుకావాలని కోరారు.

## మాదిగ దండోరాకు అభినందన



మాట్లాడుతున్న అజిత్ బాబు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ వర్గీకరణకు 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేసి సుప్రీంకోర్టులో విజయం సాధించిన మాదిగ దండోరాకు మాదిగ ఆత్మీయ కలయిక అధ్యక్షుడు కటికల అజిత్‌బాబు అభినందనలు తెలిపారు. తీర్పు చెప్పిన ఏడుగురు జడ్జిలకు ఆత్మీయ కలయిక తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో మాదిగల ఆత్మీయ కలయిక సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు మేరకు తక్షణమే వర్గీకరణ చేయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పోలిట్ బ్యూరో సమావేశంలో జిల్లాల వారీగా వర్గీకరణ అమలు చేస్తామని చెప్పారనీ, అలా కాకుండా గతంలో చేసిన విధంగానే చేయాలని కోరారు. ఆ విధంగా చేస్తేనే 59 మాదిగ, మాదిగ ఉపకులాలు లబ్ధి పొందుతాయన్నారు. సమావేశంలో పి.సుంకన్ పండు, నూనె రమేష్, ఎమ్మార్పీఎస్ సభ్యులు పచ్చల రాజేష్, నంబూరి సురేష బాబు, బిలుగుది బాబురావు, కాకాని జగదీశ్వరరావు, కండెల వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

### దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం అరుణోదయ కళా సమితికి చెందిన శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై మంజూష శిష్య బృందం పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను పలువురు భక్తులు అభినందించారు. అనంతరం ఆలయ అధికారులు మంజూష శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం గోరకవి సంపత్‌కుమార్‌చే నారాయణ తీర్థుల తరంగాల గానం నిర్వహించారు.